
పరశురామ్

అనువాదకులు:
చక్రపాణి



# దక్షిణారాయ్

చటర్జీ మహాశయుడు సెలవిస్తున్నాడు—'వ్యాఘ్రం సంగతి చెప్పాలిసొస్తే రుద్రప్రయాగలోవున్న వ్యాఘ్రాన్నే చెప్పాలి. అబ్బ! ఏమిపులి, రాయల్ టైగర్! సుందరవనంనుంచి ఎండాకాలం అక్కడకు ఛేంజి (గాలిమార్పు) కొస్తో వుంటుంది. ఆ స్థానమహత్యమో, మరేమోకాని, అక్కడ కంతమంది తీర్థయాత్రికులొస్తూ వుంటారా-ఎవ్వరి జోలికీపోదు! దొరలను మాత్రం ఏరిఏరి తింటో వుంటుంది.'—

'మంచి పులేనే! యిక్కడకుకూడ కొన్నిటిని తీసుకురాకూడదూ? చప్పున స్వరాజ్య మొచ్చేస్తుంది-స్వదేశీ, బాంబులు, చరఖా, సత్యాగ్రహం, కౌన్సిలు స్థంభన-ఏవీ అవుసరముండదు'— వినోద వకీలుఅన్నాడు.

సాయంకాలం వంశలోచన బాబు డ్రాయింగురూంలో చర్చ జరుగుతోవుంది. గృహయజమాని తదేకధ్యానంతో ఒక యింగ్లీషు పుస్తకం చదువుతున్నాడు. How to be happy though married అతని బావమరిది నగేనుడు మేనల్లుడు ఉదయుడుకూడ వున్నారు.

చటర్జీ హుక్కా ఒకపెద్ద పీల్పు-ఓ నిముషంవరకు-పీల్చి అడిగాడు-'ఆ ప్రయత్నం జరగలేదని నీకెట్లా తెలుసు?'

-'జరిగిందాయేం! ఎక్కడ? రౌలట్ రిపోర్టులో ఆసంగతి ఏమీ వ్రాయలేదే.!

-'చదివావు మా లారిపోర్టు వొహటి! అరే గవర్నమెంటుకు అంతా తెలుసూ? There are many things. అవన్నీ చెప్పటానికి వీలేనా?'

-సంగతేమిటో స్పష్టంగా చెప్పకూడదూ, మేంకూడా వింటాం.

చటర్జీ క్షణకాలం గంభీరంగా వుండి అన్నాడు-'హుం'

నగేనుడు బతిమాలాడు-'చెప్పండి చటర్జీగారూ!'

చటర్జీలేచి దర్వాజా, కిటికీల దగ్గరకువెళ్ళి తొంగిచూచాడు. తర్వాత యధాస్థానానికివచ్చి మళ్లీ అన్నాడు-'హుం'

వినోద-'ఏమిటీ చూచింది?'

చటర్జీ-'చూట్టానికి, ఏముంది? హరేన్ ఘోషాల్ హఠాత్తుగా ఎక్కడనుంచన్నా వూడిపడతాడేమోననే; పోలీసుల గుప్తచారుకు ముందుగానే జాగర్త పడటం మంచిది'

వంశలోచనుడు పుస్తకం క్రిందపెట్టి అన్నాడు-'ఆ వ్యవహారాలన్నీ యిక్కడ చర్చింటం కుదరదు. ఆఫీసరుయింట్లో అలాంటి సంగతులు రాకుండా వుంటమే మంచిది.'

చటర్జీ—'మంచిదే! మరి వ్యవహారంకూడ చాల' అలౌకికమైంది. వింటే శరీరంనిండా జెర్రులు ప్రాకినట్లుగా వుంటుంది. పోనీండి, వదిలే

సేద్దామా సంగతి!- అరే, వూదో! మీా ఆవిడ కన్నారింటినుంచి ఎప్పు డొచ్చిందిరా?'

వినోదుడు వుదయుని కడ్డువచ్చి అన్నాడు—'సంగతి తెలుసుకుంటే మాత్రం దోషం ఏమిటి? పదండి, మనయింటికి; అక్కడ ఆఫీ సరె వ్వరూలేరు.'

వంశలోచనుడు ఆదుర్దాగా అన్నాడు-అరే, వద్దొద్దు! యిక్కడే కానివ్వండి. కాని,--చటర్జీగారూ! సెడిషన్ మేటరు వదిలేసిచెప్పండి'

—'అలాగే! నేను వదిలేసే చెప్తాను' చటర్జీ చెప్పసాగాడు.

'ఎక్కువరోజుల సంగతికూడ కాదు. బకూదత్తుపేరు మీరు వినే వుండొచ్చు. మన మజిలీపూరులో వుండే చరణఘోషు కక్కాయి...'

వినోద—'బకూలాల్‌దత్త్? కపా లీ టోలాలో ఆయన మేడేకదూ, యింప్రూవ్‌మెంటు ట్రస్టు పగుల గొట్టించింది? ఆయన చచ్చాడని విన్నామే-కౌన్సిలుకు పోలేకపోయా ననే మనోవ్యాధిచేత!'

చటర్జీ—'మట్టి విన్నావు! బకూ బాబు వున్నాడుకాని, యిప్పుడు గుర్తించటం చాలాకష్టం. ఒక అణా ఖర్చు పెట్టితే చూచిరావచ్చు. ఆది వారం సాయంత్రం మాత్రం రూపాయి యీయాలి'

వినోద-'ఎట్లా?'

చటర్జీ-'బుద్ధి దోషంవల్ల పాపం అంతా పాడుచేసుకున్నాడు.-ఎటు వంటి గౌరవం, ఎటువంటి సంపదా! స్వామికృప కలిగింది. కాని, చివ రకు బకూ బాబు మతి చలించి పోయింది!'

వినోద-'ఎవరాస్వామి?'

చటర్జీ-'స్వామీా దక్షిణరాయ్.'

ఉదయుడన్నాడు— 'మాపి న మామపేరుకూడ దక్షిణామోహన రాయ్!'

చటర్జీ-'ఊదో, నువ్వూ నవ్వేం చావురా బాగా! చినమామకాదు రా అబ్బాయీ, దేవత! పచ్చి మాంసంతినే దేవత, వ్యాఘ్రాల దేవత'-చటర్జీ రెండు చేతులూ జోడించి, కపాలానికి ఆనించి రాగ యుక్తంగా పాడసాగాడు.

నమామి దక్షిణరాయ సుందర వనవాస

చెంగలి అవురుబీటిలో నుందువు ద్వాదశమాస

దక్షిణం కాకద్వీపం షాహా బాజపూర్,

వుత్తరం భాగీరథి ప్రవహించే దూర్.

పశ్చిమం ఘాటాల్ పూర్వం బాకలా పరగణా,

ప్రభువు వేటాడుతోంటాడు యీా సీమచెరగునా.

గోవ్యాఘ్రం, శార్దూలం, బెబ్బులీ చిరుతపులీ,

నల్లపులీ, మచ్చలపులీ, చారల పులీ, గీరలపులీ,

చెల్లెక్కేపులీ, గుట్టలెక్కేపులీ, సీటిపులీ, అన్నిజాతులు,

మొత్తం 363 రకాలు ప్రభువు వారి జ్ఞాతులు.

ప్రతి అమావాస్య ప్రభువుకు పుణ్యాహంచేస్తారు,

జనులు మహిషవరాహాలు కానుకగా యిస్తారు.

రాత్రంతా ధూముధాముగా నృత్యగీతాలు జరుగుతాయి,

గాండ్రు గాండ్రుమని అరవులకు దశదిశలు కంపిస్తాయి.

మగవులు లారూ ముప్పైఆరు ఆడ వులులను కళాయుక్తంగా కలిపీ,

తాళాలూ, తబలాలూ, భజన లతో దాడరాగం మలిపీ,

దక్షిణరాయ్‌వాళ్ళచే గుండ్రంగా నృత్యంచేయిస్తాడు,

తర్వాత సంతోషంతో అందరినీ చంపుకుతింటాడు.

నిత్యం ప్రభువుసేవలో జీవహింస జరుగుతూ వుంటుంది.

ఝూముఝూముకూ వారివొల్లు మండుకొంస్తూ వుంటుంది.

పెద్దపెద్ద జంతువులను ప్రభువు తింటాడు అతిజల్దీగా,

మాంసం మెక్కటంవల్ల వారి రంగు పసుపయిందిగా!

మేకా, పందీ, ఎద్దూ, హిందూ, ముసల్మాన్లూ,

ప్రభువుగారి వుదరంలో అంతా సమాన్లు.
పండిత పామరులనే భేదంలేశం కూడా వుంచుకోడు,
సకలజీవాలనూ ప్రభువు అతి తృప్తిగా ఆరగిస్తాడు.
దండాలు దక్షిణరాయ్ నీవీ సహాయంచేయ్,
ఆఖరుకు నీపంజా దెబ్బ మా మీద పడుకుండాచేయ్!

వినోద—'యీ భైరవగీత (Doggeral song) మెందులోది?'

చటర్జీ—'రాయవిలాసం. నా దగ్గర ఓ తాటియాకుల గ్రంథం వుంది-మూడువందల ఏండ్లక్రితంది! అది లాగాలని చిమేషమిత్తర్ కొట్టుకు చస్తున్నాడు. దానిమీద నిబంధం (థీసిస్) రాసి, యూనివర్సిటీ నుంచి డాక్టరీ కొట్టేశేయాలని చూస్తున్నాడు. నూటయాభైవరకు ఆశ పెట్టాడు. నేను వొప్పుకోలా. నిబంధంరాస్తే నేనేరాస్తా నన్నా-నాడీ జ్ఞానముంది. డాక్టరు అయేటట్లయితే యీ ముసలతనంలో శాస్త్ర ఆధారమన్నా చిక్కుతుందిగా!

వినోద__ 'సరే, తర్వాత?'

చటర్జీ- 'బకూ బాబు సంగతి కదూ చెప్తుంది.- పదిహేను సంవత్సరాల క్రితం అతని స్థితి అంత బాగా వుండేది కాదు. పరివారాన్ని స్వగ్రామంలో వుంచి, తానుమాత్రం కలకత్తాలో ఒక మెస్సులో వుంటూ, రామజాదు ఎటర్నీ వద్ద గుమస్తాగిరి చేసేవాడు. నెలకు యెనభై రూపాయల జీతం. రామజాదు యితనికి క్లాస్ ఫ్రెండ్. తత్సంబంధంవల్లనే యీ నౌకరి కూడ. యిహ, బకూబాబుదగ్గర కొంచెం హస్తలాఘవ ముంది. విపక్షుల దగ్గర లంచం తీసుకొని, ఒక సమను జారీ చేయడంలో ఆలస్యం చేశాడు. మరి రామజాదా ఖచ్చితం అయిన మనిషి. స్నేహితుడని రాయితీ ఏమీ చూపించలా. సంగతి రుజువుకాగానే నిలబెట్టి దివాళా తీశాడు. కోపంతో బకూబాబు బుర్ర కుతకుత ఉడికిపోయింది. ఆ పొంగులో గుమస్తాగిరీకి రాజీనామా యిచ్చి, తిన్నగా బసకు తిరిగి వచ్చాడు. మనస్సు ఖరాబు. మెస్సులో వుండే బ్రాహ్మడితో భోంచేయనని చెప్పేశాడు. తర్వాత తటాకతీరానికి బయలుదేరాడు తల చల్ల చేసుకోడానికి! ఆ వుడుకులో వుద్యోగానికి ఉద్వాసనమిచ్చాడు కాని, కాపురంగడిచేదెలా? నిల్వ నిండుకున్నట్టే. రామజాదుమీద ప్రచండమైన ఆక్రోశం కలిగింది.

ఆరే, వకీళ్ల యిళ్ళల్లో, ఒకటీ అరా, అందరు పైన సంపాదిస్తో వుంటారు- అలాగని చిన్నానాటి స్నేహితుని కూడ అవమానపర్చటమే? భేష్! దీనికి తప్పకుండా బకూబాబు బదులు తీర్చుకుంటాడు.

రాత్రి తొమ్మిదిఘంటలకు బకూ బసకు తిరిగివచ్చాడు. బస బావురుమంటోంది. ఆవాళ శనిహారం. మెంబర్లంతా థియేటరుకు వెళ్లారు. బకూలాల్ నిశ్శబ్దంగా లోన ప్రవేశించి చూచాడు- వంటయింట్లో...'

నగేనుడు అడిగాడు- 'దక్షిణరాయ్?'

చటర్జీ- 'వంటయింట్లో, మెస్‌లో వుండే దాసీది బకూలాల్ తివాసీ మీద కూర్చుని- అది అతని భార్యే అల్లింది- అతని పళ్ళెంలో నే పూరీలు పెట్టుకు తింటోంది. వంట బ్రాహ్మడు విసనకర్ర తీసుకొని దానికి విసరుతున్నాడు. దాసీది తన జానెడు నాలుక మునిపళ్లతో కొరుక్కొని, మూరన్నర చెంగు ముసుగేసుకుంది. యితర దినాల్లో అయితే బకూ బాబు లంకాకాండ జరిపేవాడే, యివ్వాళ చూచీ చూడనట్టు వూరకొన్నాడు! మెదలకండా పైకివెళ్ళి పక్కమీద వారిగాడు.

తర్వాత అగాధామైన చింత. ఏమి చేయాలి? ఎక్కడనుంచి వస్తుంది డబ్బు?- హుగ్లీలో యితనికో మేనత్త వుంది. విపుల సంపత్తి గల విధవ. వారసు లెల్లా, కొడుకొక్కడే భూతో. వెధవాయి భూతో వుత్త దగుల్బాజీ. అల్ప

వయస్సులోనే అధః పతితుడయ్యాడు కాని మేనత్తమాత్రం వాడినే పట్టుకుపూరేగుతుంది. యిటువంటి యోగ్యుడైన మేనల్లుని వంక తిరిగి కూడ చూడదు! యీముసలి పీనుగ నుంచి ఏవిధమైన ఆశాలేదు.

బకూలాల్ ఆలోచించసాగాడు- భగవంతుని న్యాయమిదేనా! దౌర్భాగ్యుడు భూతో పదిలక్షలకు అధికారి. మరి అతని మేనమామ కొడుకో-'అద్యభక్ష్య ధనుర్గుణ'తన క్లాస్ ఫ్రెండ్-ఆ రామజాదు ముండాకొడుకు-క్లయింట్ల కళ్ళల్లో కారం కొట్టి లక్షలకు లక్షలు లాగుతున్నాడు. యిటు, తానో ఒక సామాన్య నౌకరికోసం నాలుక పీక్కొంటున్నాడు. ధూత్, నీ భగవంతుడు బండలుకాను!

యింతలో పీరికో మిత్రుడు చెప్పినమాటలు జ్ఞాపకం వచ్చాయి. ఆయన భగవద్భక్తుడు. భగవంతుని గనుగభక్తితో ప్రార్థిస్తే, తప్పక మన కోరికలు నెరవేరుస్తాడని ఆయనచెప్పాడు. సరే, అలాగే ఒకసారెందుకుచేసి చూడకూడదూ?-'ఆలస్యం అమృతంవిషం' బకూలాలు ఒక్క ఎగురున మంచం నుంచి దూకాడు. స్టౌవ్, వెలిగించాడు. టీ కాచుకొని మూడు కప్పులు త్రాగాడు. యివ్వాళ రాత్రంతా భగవంతుని ప్రార్థిస్తాడు.

బకూలాలు దీపం తీసివేసి మంచంమీద ఏటవాలుగా పండుకొని తపస్సు ప్రారంభించాడు.—

'హే భక్తవత్సల హరి, హేబ్రహ్మ, హే మహాదేవ! యీ దరిద్రు నొకకంటితో చూడండి. ఆ కాలంలో మీరు భక్తుల మొరలువినేవారు- యిప్పుడీ దీనుడంటే ఎందుకు విముఖులవుతారు? హేదుర్గా, కాళీ, లక్ష్మి-మీలో ఎవరు తల్చుకొన్నా నన్నొక వొడ్డుకు పట్టించగలరు. వరమివ్వండి, వరమివ్వండి--ఎక్కువకు అఖర్లా, ఒక లక్షకుమాత్రం. ఊహుఁ! ఒకలక్షతో ఏమీకాదు- గృహిణి నగలకోసం సగం గుంజివేస్తుంది. రామజాదుకు హీనంగా చూచుకున్నా పదిలక్షలు వుంటై. నాకు కనీసం అయిదులక్షలన్నా కావాలి-కాదు కాదు, పదిలక్షలు. దండాలు దేవతలారా! మీకు లక్షంటే ఎంతో పదిలక్షలన్నా అంతే! అంత యిచ్చినందువల్ల విశ్వబ్రహ్మాండానికి వృద్ధిక్షయాలేమీ కలగవు. అనేకమందికి కోట్లు యిచ్చి వున్నారు. నాకు పదిలక్షలు చాలు. లక్షరూపాయలు పెట్టి యిల్లు, యాభై వేలుపెట్టి ఫర్నిచరు తర్వాత యాభై వేలు వాటికీ వీటికీ- యిదిగో చూడరాదూ? ఒక మంచి మోటరుకారు... ఊహుఁ! ఒహటైతే చాలదు. గృహిణే దాన్నంటిపెట్టుకు కూర్చుంటుంది. మాట్లాడితే థియేటరూ, గంగాస్నానం...సరే ఆమెకోసం ఫోర్డుకారు కొంటున్ చేస్తా-సెకండ్ హాండు ఫోర్డు--పిల్లా జల్లా ఎక్కువ వుటంకూడా బావుండదు. మరి, ఆ రామజాదుగాణ్ని-రాస్కెల్ని-ఎవరన్నా కట్టివేసి తీసుకొస్తే—ఫుట్ పాత్ మీద నిలబెట్టి వాడి డొక్క చించివేస్తా-ఆ కాసేపు నరసింహస్వామికి బంటునౌతా!-- హే బుద్ధదేవ, ఏసుక్రీస్తు, శ్రీచైతన్య-యివ్వాళకు మాత్రం నన్ను క్షమించండి. ఇదంతా మీకిష్టం కాదని నాకు తెల్సు. దండాలు దేవతలారా మీకందరకు! నా యీ తపస్సును మరచిపోవద్దు. తర్వాత మిమ్మొక రోజున సంతోషపెడతా. హేనారాయణ్, హేదర్పహారీ కృష్ణ, హే పైగంబర్, హే బ్రాహ్మల బ్రహ్మ, యూదుల యెహోవా, పారసీల అహుర్, దేవ,దైత్య, యక్ష, రక్ష, సైతాన్-- ఐఁ! రామో, రామో.- సైతానయితే మాత్రం నష్టమేమిటి? కాకపోతే చచ్చాక నరకానికి పోతాం, పోనీ! అంతగా భయపడితే కుదరదు. ఓ ముప్పైమూడు కోట్ల దేవతలారా, మీలో ఎవరయినా సరే, దయ వుంచండి- దయ వుంచండి. నేను ఏకాంతః కరణతో భక్తిపూర్వకంగా మొర పెట్టుకుంటున్నా.- ధనం దేహి, ధనం దేహి.'

—'సరే చటర్జీ గారూ! తమరు బకూబాబు మనస్సులోని సంగతు

డట్లా తెలుసుకున్నారు?'- వినోదు డడిగాడు.

చటర్జీ- మీకదే తెలియదు. కలికాలం! అంతమాత్రంచేత అసలు బ్రాహ్మలు అక్కడక్కడ నలుగు రైదుగురు లేకపోలేదు. బీదవాణ్ణయి తేఏం? కశ్యపగోత్రం, పద్మగర్భ ఠాకుర సంతానం. యీ ముసలికే దార చటర్జీనాళాల్లో ఋషుల రక్తం ప్రవహిస్తోంది! కొంచెం శ్రమ చేస్తే లోకుల ఎముకల్లో వున్న సంగతులు తెలిసికో గలను- మనస్సు లోని మాటలొక లెఖా?- తర్వాత, బకూబాబు అదే విధంగా ఏకాగ్ర చిత్తంతో తపస్సు చేస్తో వున్నాడు. అతని రెండుకళ్ళ వెంట కన్నీటి ధారలు కారసాగాయి. బాహ్య జ్ఞానం సున్న. కేవలం ఒకే మాట, ధనం దేహి! యీ సమయంలో క్రిందనుంచి ఒక శబ్దం వినపడింది.- 'టింగ్, టింగ్.-' బకూలాల్ విసురుగా లేచాడు నిప్పులుల్ల వెలిగించాడు-పిట్టగోడ వద్దకు వచ్చి క్రిందకు చూచాడు.

నగేనుడు రోమాంచితుడై మళ్లీ అనేశాడు— 'దక్షిణరాయ్.'

చటర్జీ మహాశయుడు ముఖం చిట్లించుకొని వెక్కిరిస్తో అన్నాడు- 'దృచ్ఛిన రాయ్, నీ తలకాయ్! అంతా నీవే చెప్పరాదూ! మరి నేనిక్కడ గొంతు చించుకు చావడం ఎందుకు?'

ఉదయుడు వుప్పొంగుతూ అన్నాడు- 'నగేను మామలో వున్న దురల వాటే యిది. యితర్లనెవ్వరినీ మాట్లాడ నివ్వడు. మా మరదలకు లగ్నాలు పెట్టుకునే టప్పుడు—'

చటర్జీ చంచలుడై అన్నాడు- 'అరేపడండి పోయి ఏట్లో! ఒకడు ఆగాడనుకుంటే రెండోవాడు బాకా ఎత్తాడు. పోండి! నేనికే మీ చెప్పను.'

'ఎందుకురా మీరు రసభంగం చేస్తారు! బ్రాహ్మణ్ణి చెప్పనీయ కూడదు.-' వినోదుడు అతుపు చేసాడు.

చటర్జీ మరల చెప్ప సాగాడు- 'బకూబాబు పిట్టగోడ వద్దకు వచ్చి చూశాడు- బ్రహ్మ దేవుని హంసా. శివుని నందీ, విష్ణుని గరుత్మంతుడూ- ఏదీ కాదు. ఒక మూలను యెర్ర సైకిలు ఆనించి వుంది. బకూ కేక వేశాడు- 'ఎవరువారు?'

టెలిగ్రాఫ్ ప్యూను తలుపు తట్టడానికి కాబోలు మెట్లెక్కాడు. కేక విని వెనక్కు వచ్చి అన్నాడు- 'తంతి వుంది '

ఎవరిచ్చిన తంతి? బకుబాబు గుండె దడదడలాడ సాగింది. అతను లాటరీ టిక్కెట్టుకూడ కొనలేదు. అయితే భార్యా, పిల్లల్లో ఎవరన్నా జబ్బుపడ్డారా?—యివ్వాళ మధ్యాహ్నమేగా యింటివద్దనుంచి, అంతా బాగున్నారని కార్డువచ్చింది. బకూబాబు కాళ్ళీడ్చుకొంటూ దిగి వచ్చాడు.

తంతి సమాచారం—భూతో హఠాత్తుగా చనిపోయాడు. మేనత్త కూడ యిప్పుడో అంటూవుంది. త్వరగా రా'

బకూబాబు 'యా అల్లా' అని ఒకగంతు వేశాడు. తర్వాత మనీ పర్సు జేబులోంచితీసి ప్యూను చేతిలో కుమ్మరించాడు. పాపం ప్యూను వచ్చేప్పుడే తెలుసుకు వచ్చాడు-'చావుకబురు-బక్షీస్ అడగటం కుదరదని' యిప్పుడు అయాచితంగా మూడురూపాయల ఆరణాలు దొరికేవరకు—దుఃఖంవల్ల బాబుగారిబుర్ర చెడిపోయి వుంటుం దని వూహించాడు. యిహ అక్కడ వుండలా.

భూతో చనిపోయాడా? నిజంగా చనిపోయాడా? వారే, భూతో, దౌర్భాగ్యుడా!... నిశ్చయంగా మద్యమే వాడి లివర్ను తినేసి వుంటుంది. వెళ్లి దర్జాగా శ్రాద్ధం చేయాలి—బకుబాబు ఆ రాత్రే హుగ్లీకి ప్రయాణమయ్యాడు.

బకుబాబుకు సుడితిరిగింది. కాని పదిలక్షలకుకాదు. ఐదులక్షలకు మాత్రం డబ్బు తక్కువైనందుకు, మొదట మనస్సు కొంత పీకులాడింది. కాని, క్రమంగా కమ్మడిపోయింది. యిల్లు దొరికింది. బండిదారి

కింది. అన్నీదొరికినై. బకూలాలు అన్ని రకాల వ్యాపారాలు చేయసాగాడు. కొన్నాళ్ళకు యుద్ధమొచ్చింది. బకూ ఒకే వస్తువ అయిదారుగురికి జట్టీ లీయసాగాడు. మట్టి పట్టుకుంటే బంగారమైంది. సంపాదనకు హద్దు పద్దూ ఏమీ లేదు. కాని, వయస్సువృద్ధితో పాటు బకూ బుద్ధికూడ కొంచెం మందగించి పోయింది. యీవిధంగా పదునాలుగేండ్లు గడిచాయి.'

యింతవరకు చెప్పి చటర్జీ మహాశయుడు హుక్కా తీసి దమ్ముచేయసాగాడు. వినోద బాబు ప్రశ్నించాడు- 'ఏది, చటర్జీ గారు! వ్యాఘ్రమేది?'


చటర్జీ -'వస్తుంది. వస్తుంది; ఎందుకంత తొందర పడతావు? సమయం రాగానే వచ్చేస్తుంది.- బకూ బాబు యాభైయ్యోదవ పడిలో పడ్డ రాత్రి వంగమాత అతన్ని హెచ్చరించింది- 'వత్స బాకూ! వయస్సు, మిగిలి పోతోంది, ధనమూ కావలసినంత కూడుకొంది. నీవు దేశాని కేమి సేవ చేశావు?' బకూ జవాబిచ్చాడు- 'తల్లీ నేను అధమ సంతానాన్ని, ఉపన్యాస మివ్వడం నాచేత కాదు. మలేరియా భయం వల్ల స్వగ్రామం కూడ పోవటం లేదు. ఖద్దరు నాకు నహించదు- సుఖపడ్డ శరీరం- దేశీ మిల్లు ధోవతులకే పొట్ట వొరుసుకు పోతూ వుంటుంది. యిహ- బాంబులు వేయటం అలా వుంచు- నేలటపాకాయ వేయటానికే కలేజా లేదు. కర్తవ్య మేమిటో తమరే చెప్పాలి. యీ వయస్సులో కాయకష్టం చేయలేను. తేలిక పని ఏదైనా వుంటే సెలవివ్వు తల్లీ!'

వంగమాత అంది- 'కౌన్సిల్లోకిపో!'

అమ్మ పని ఆజ్ఞాపించటంతో తీరింది. యిక్కడ బకూకు ప్రాణాల మీదకు వచ్చింది. కౌన్సిల్లోకి పోయేదెట్లా? చాలా ఆలోచించి తన అసిస్టెంటు దొరను అడిగాడు- 'మూడువేల రూపాయలు డ్రంకెన్ సెల్లర్స్ హోంలో యిసాను—గవర్నమెంటు గనక తనను కౌన్సిలుకు నామినేటుచేస్తే.' దొర పలుకులు-డబ్బయితే తను గ్లాడ్లీగా తీసుకుంటాడు. కాని ప్రతిఫలం మాత్రం శూన్యం. కారణం గవర్నమెంటు వాళ్ళువీళ్ళదగ్గర లంచాలు పుచ్చుకోదు. బకూబాబు అరిగిపోయిన అర్ధరూపాయి మొహం వేసుకొని తిరిగివచ్చాడు. తర్వాత ఒక రాజనైతిక నాయకుణ్ణి పట్టేడు--'నేను ఎలక్షనులో నిలబడాలను కుంటున్నా. నన్ను మీ దళంలో భర్తీచేసుకోండి. క్రీడు ఏదైనా కానీయండి సంతకం చేస్తాను' అన్నాడు. నాయక మహాశయుడన్నాడు—'దూత్తెరీ క్రీడ్! ముందు లక్షరూపాయలు బయటకు తీయి, తర్వాత చూద్దాము-మన నిఖిల వంగీయ సర్వనాశక ఫండ్ కోసం!—సర్వాలను చంపకపోతే పల్లెల ప్రజలు సపోర్టెలా చేస్తారు?' బకూబాబన్నాడు—'ఛీ,ఛీ! దేశసేవ చేయటానికికూడా డబ్బా? నేను లంచం యివ్వను'-తిరిగి వచ్చాక, అంతా దొంగ ముండాకొడుకులని స్థిరపరుచుకున్నాడు. ఖర్చుపెట్టాల్సి వుంటే తానే బాగా ఆలోచించి పెట్టాడు.

కలకత్తాలో నిలబడటానికి వీలుగాలేక--సౌత్ సుందరవన్ కాన్స్టిట్యుయన్సీకు--నిలబడాలని బకూలాల్ నిశ్చయించుకున్నాడు. ప్రస్తుతం, అక్కడ కొంత జమీందారీ కొన్నాడు. అందువల్ల వోట్లు వసూలు చేసుకోవటంకూడా కొంత తేలిక. ఎలక్షను రెండుమాసాలు వుందనగానే, యిక్కడ బిఛానా మెత్తి అక్కడ ఫీఠంవేశాడు. తర్వాత ఒకరోజున, హఠాత్తుగా' బకూబాబుకు పాతశత్రువైన రామజాదు బాబు, రాత్రిళ్లురాత్రిళ్ళు—ఖద్దరు సూటువేసికొని-ఉపన్యాసాలివ్వడం సాగించాడని కబురు వచ్చింది. అతనుకూడ సుందరవనం నుంచే నిలబడతాడట. బకూబాబుకు డబల్ క్రోధముచే పిచ్చెక్కింది- తాను తిన్నగా ఔరిటీ బజారుకువెళ్లి మూడోనంబరు పిలక కొనుక్కొచ్చాడు. యింటిముందు రెండు

మూడు అభోతులను కట్టివేశాడు. తరువున అంతజోరుగా రాయగల సాహిత్యక గుండాలు లేరు! వోటర్ల దృష్టి లోంచి తాను క్రమంగా పడి పోతున్నానని బకు బాబు గ్రహించాడు. ఒకరోజున అతను చాల వ్యాకులచిత్తంతో కూర్చునివుండగా పద్దానుగు సంవత్సరాల క్రితం, దేవతల దయవల్ల అతని అదృష్టం తిరిగి పోవటం జ్ఞప్తికి వచ్చింది. యీసారి కూడా అలా



'మేడ శెలింగ్సుమీద గోడలమీద ఆవుపేడ పిడకలు కొట్టించాడు'

వార్తా పత్రికల్లో నానా బూతులు పడసాగినై. బకూలాల్ దత్త్! అతన్ని ఎవరెరుగుదురు? పద్ధానుగు సంవత్సరాల క్రితం ఎవరిదగ్గర నౌకరిచేసేవాడు? ఆ నౌకరి ఎందుకు పోయింది? గుమస్తాకు అంత డబ్బు ఎక్కడనుంచి వచ్చింది? ఓ దేశవాసులారా! బకూలాల్ అంత సోడావాటరు ఎందుకు కొంటాడు? ఎవరితోకలిసి తింటూవుంటాడు? బకులాలు నలువూ అతని చిన్న కొడుకు ఎరుపు ఎందుకనీ? జాగర్త! బకూలాల్, నీవు శ్రీయుత రామజాదుగారితో పోటీచేయబోకు. అట్లయితే యింకా చాలా సంగతులు వెల్లడిస్తా!

బకూబాబు కూడా దీనికి ఎదురు జవాబులు యివ్వసాగాడు. కాని అంతరక్తి కట్టలా. కారణం యితని ఎందుకు కాదు? మరోసారి అదేవిధంగా మనోవాక్కాయాలతో 33 కోట్ల దేవతలకు మొరపెట్టు కోవాలని నిశ్చయించుకున్నాడు. కేవలం వంగమాత మీద అధారపడితే లాభం లేదు - కారణం, ఆమె నిజమైన దేవత కాదు- బంకిమ చటర్జీ చేత నిర్మించబడింది. ఆమెలో ఏ యోగ్యతా లేదు ప్రజలకు పిచ్చి ఎత్తించటం తప్ప!

రాత్రి పదిఘంటలప్పుడు బకూబాబు తన ఆఫీసురూంలో ప్రవేశించాడు. తనకు చాలా పనులున్నవి- ఎవ్వరూ వచ్చి తనను విసికించ వద్దని దర్వాన్‌తో చెప్పాడు. యీతఫా పడకగదిలో కాదు- కారణం గృహిణి వుంటం వల్ల తపస్సుకు విఘ్నం కలుగుతుంది.

బకూబాబు యీజీచెయిర్‌లో పండుకొని యీ క్రింది అర్థం వచ్చేటట్టుగా ప్రార్థన చేయ సాగాడు—

హేబ్రహ్మ, విష్ణు, మహేశ్వర, దుర్గా, కాళీ, యిత్యాది దేవతలారా- పూర్వం మీరొకప్పుడు నా గౌరవం కాపాడారు- నేనుకూడ నా శక్తికొలది మిమ్ము తృప్తి పరిచాను. తర్వాత నానా వ్యవహారాల్లో వ్యస్తుడనగుటవల్ల మిమ్మంతగా జ్ఞాపకం పెట్టుకోలేక పోయాను- మనస్సులో యిదేమీ పెట్టుకోకండి, బాబులారా! నేను చేయక పోయినా- గృహిణి ఎల్లప్పుడు తృణమో పణమో మీకు సమర్పించుకొంటూనే వుంది. యిదిగో మీకెరిగిందేనా- వెండి తామ్రి కుండం, గంట, పంచప్రదీపం, సాలగ్రామానికి బంగారు సింహాసనం, యివన్నీ నా డబ్బుతో- మరి తమకోసం చేయించినవే! నన్ను కూడ చూడండి, కాస్త తీరిక చిక్కగానే మనస్సును ధర్మకార్యాల్లోకి పోనిస్తున్నాను. పిలక పెట్టాను, గోసేవచేస్తున్నాను. యిప్పుడు నాకికే కోరికా లేదు. రామజాదుగాణ్ని మాత్రం నాశనం చేయండి. వాడికి వోట్లువచ్చే ఆశకూడ కనిపించటం లేదు. దండాలు ముప్పైమూడు కోట్ల దేవతలారా, వాణ్ని వధించండి! కాని, యిప్పుడు కాదు- నామినేషన్ పేపరు వేసిన తర్వాత రెండు రోజులకు- లేకపోతే యింకో ముండా కొడుకు నిలబడతాడు, కలరా, మసూచికం, బేరిబేరి, హార్ట్‌ఫేల్

యాక్సిడెంట్- ఏదో ఒకటి. నేను వీటిని గురించి ఎక్కువ యేం చెప్పేది. మీకు అన్ని విధాలు తెలుసు! పిసికి వేయండి బాబులారా, దొంగ ముండాకొడుకు గొంతుపిసికి వేయండి. రక్తం కావాలి. రక్తం దేహి, రక్తం దేహి!

బకూలాలు ఏకాగ్రచిత్తంతో యీవిధంగా ప్రార్థన చేస్తో వున్నాడు. యీ సమయాన ఆ యింట్లో టప్పు మని ఒక శబ్దం వినపడింది...నగేనుని పెదవులు కదిలాయి. మెల్లగా అన్నాడు.—'ద'—

చటర్జీ గద్దించాడు- నోరు ముయ్!- బకూబాబు ఆఫీసు గూం తనాబిని ఒక బల్లి అంటుకొని వుంది. అది అటు యిటు కదలటంలో, బకూలాలు టేబిలుమీద, టప్పుమని జారి పడింది. బకులాలు ఉలిక్కిపడి చూశాడు- టేబిలుమీద బల్లీ, దానిక్రింద పోస్టుకార్డూ!

పోస్టు కార్డుమీద యిదివరకు కన్ను పడలా. యిప్పుడు చదివి చూశాడు. దానిలో వ్రాసి వుంది- 'మహాశయా' తమరు ఎలక్షనుకు నిలబడ దలచుకొన్నారనీ- పరిస్థితులు తమకంత ఆనుకూలంగా లేవని విన్నాను. మీరు సహాయం తీసుకోని. నా ఆదేశ ప్రకారం నడుచుకొంటే- తమకు తప్పక జయం కలుగుతుంది. రేపు సాయంత్రం మిమ్ము కలిసికొంటాను. చిత్తగించవలెను- రామజంబుకశర్మ.'

బకూలాలు ఉత్సాహంతో అన్నాడు- 'జయ్‌మాకాళ్, జయ్ బాబా తారకనాథ్ బ్రహ్మ విష్ణు, పీర్, పైగంబర్! యీ పోస్టు కార్డు తమ పీఠే- అది నాకు బాగా తెలుసు. తమ మేలు మరవను. మీ అందరిని ఒక పంక్తిని కూర్చోబెట్టి పూజ చేస్తాను. నిశ్చింతంగా వుండండి.'- తర్వాత మన స్సులో అనుకున్నాడు.- 'దేవతలను కూడ టోపీ వేయాలి. ఉహూఁ, నమ్మకం కలగటం లేదు, ముందు పని జరిగితే తర్వాత చూస్తాను.'

ఆరాత్రి మరునాటి పగలు బకూబాబు ముళ్ళమీద గడిపాడు. యథాసమయానికి రామజంబుకశర్మ దర్శనం యిచ్చాడు. పొట్టి మనిషి, మట్టిరంగు, చుంచుముఖం, నిక్కబొడుచుకున్న చెవులూ, దుస్తులు శరీరం రంగుతో కలిసిపోయాయి. మాట్లాడేది కాసేపు హిందీ- కాసేపు బంగాలీ.

బకూబాబు సాదరంగా అన్నాడు—'కూర్చోండి. తమరు ఆర్యసమాజికులా?'

రామజంబుకశర్మ అన్నాడు- 'నహీఁ నహీఁ,' బకూ మరల జిజ్ఞాస చేశాడు- 'మహావీరపార్టీ ప్యాక్టువాలా కౌన్సిల్‌తోడా? చరాబాజ్?'

రామజంబుకశర్మ ఏపార్టీవాడు కాడు. అతనొక పొలిటికల్ పరివ్రాజకుడు. బకూబాబు భక్తితో పాదధూళి తీసుకున్నాడు. రామజంబుకశర్మ అన్నాడు- 'బస్, హువా. హువా,'

తర్వాత అసలు సంగతుల్లోకి దిగారు. రామజంబుకశర్మ, బకూబాబు రాజకీయ ఉద్దేశాలేవిటో తెలుసుకోవాలని పృచ్ఛించాడు- 'అతను మితవాదియా, అతివాదియా, విప్లవవాదియా, లేక స్వలాభియా' అని. బకూబాబు ఏవాదీ కాడట! కాని అవసరమయితే అన్నిటికీ ఇష్టమేనట. తనకు కావలసిందల్లా కొంచెం దేశసేవ చేయడం- రామజాదు వుండగా అది వలనుపడదట. రామజంబుకశర్మ అన్నాడు—"నీకేమీ దిగులుపడ నక్కర్లేదు, వ్యాఘ్ర పార్టీలో జాయిన్ కా!"

బకూబాబు భయపడ్డాడు. శర్మ అన్నాడు—'నే నతి గోపనీయమైన సంగతి చెప్తున్నాను, విను యీ పార్టీలో యిదివరకుచేరిన సభ్యులు లెఖ ప్రకారం మూడువందల అరవై ముగ్గురు నేను దానికి సెక్రటరీని. ఒకే ఒక వేకెన్సీవుంది. నీ కిష్టమైతే చేరవచ్చు. కౌన్సిలు సీట్లన్నీ మనమే స్వాధీనం చేసుకుంటాము.'

బకూబాబుకు నమ్మకం కుదురలేదు. అన్నాడు—'అదెలా సంభవిస్తుంది? శత్రువులు చాల బలంగా వున్నారు-నిఖిల వంగీయ సర్వనాశక ఫండంతా వారిచేతిలో వుంది. వాళ్లను ఓడించాలేము'

రామజంబుకశర్మ క్యాక్ క్యాక్ అని నవ్వి అన్నాడు-'మనకు సర్వాలూ లేవు, ఫండూలేదు. కాని దంతాలున్నై, గోళ్ళున్నై. స్వామి దక్షిణరాయి మనకు సహాయం. వారి కృపవల్ల శత్రువులంతా నశిస్తారు.'

-'వారెవరు?'

-'ఎరగరూ? ముప్పై మూడు కోట్ల దేవతల్లో, యిప్పుడు జాగ్రత దేవతవీరే, మిగతా వారంతా నిద్రపోతున్నారు. స్వామివారు నీ మొర ఆలకించారు. చేయి క్రీడు

మీదసంతకం! అతిసరళమైన క్రీడ్— కేవలం స్వామికి నిత్యనైవేద్యం సమకూరుస్తూ వుండాలి. దానికిప్రతిఫలం, శత్రువులను చంపేశక్తి పొందటం, కౌన్సిలులో అప్రతిహత ప్రతాపం.'

—'గవర్నమెంటో?'

—'గవర్నమెంటు మాంసంకూడ స్వామితింటోవుంటాడు—'

వంశలోచనుడు ఆటంకపరుస్తూ అన్నాడు—'అదేమిటి చటర్జీగారు?'

చటర్జీ—"అవునవును, జ్ఞాపకం వుంది. సరే, అంతా సైగగా చెప్పేస్తాను.—రామజంబుకశర్మ నచ్చచెప్పాడు—'ఒక్క మాటే రామరాజ్యమవుతుంది. శత్రువంశనాశనం, అంతా భాయీ బ్రదర్స్. దివ్యంగా భాగాలు పంచుకుతినొచ్చు అంతా మంత్రులే, అంతా గవర్నరులే!'

—'కాని ఆ రామజాదుగాడు చిత్తు అయేదెలా?'

—'చిత్తు అంటే చిత్తు! చాకు గుడిస్తే—చి—త్తు, చిత్తు. అతన్ని నీవేస్వయంగా వధించవచ్చు.'

బకూబాబు ముఖం కళకళ్లాడింది అతని కట్టుడు పళ్ళమీద తెచ్చుకోని నవ్వువచ్చింది. క్రీడుమీద సంతకంచేసి అన్నాడు—'స్వామీ దక్షిణరాయ్‌కీ జయ్!'

రామజంబుక శర్మ అన్నాడు—'హువా, హువా. సబ్ ఠీక్ హువా.'

రేపు ఫైవ్ అప్ ప్యాసింజరులో బకూబాబు సుందరవనం పోవటానికి సిరపరచుకున్నాడు. అక్కడకు వెళ్ళినతర్వాత, రామజంబుకశర్మ అతన్ని వెంటబెట్టుకు వెళ్ళి, స్వామి వారి ఆశీర్వాదం యిప్పిస్తాడు.

బకుబాబు బుర్ర చెడిపోయింది. ఆ రాత్రంతా శర్మ హువా, హువా, అంటున్నట్టు కలలుగన్నాడు. రామరాజ్యం, కౌన్సిలులో అప్రతిహత ప్రతాపం, మంత్రీ, గవర్నరూ—యీ పెద్దపెద్దమాట లతనికేమీ అర్థం కాలేదు. రామజాదు చస్తాడు—తాను కౌన్సిల్లోకి పోతాడు—అసలు ఆలోచనంతా యిదే. తర్వాత రామరాజ్యం కానీ, రాక్షసరాజ్యం కానీ—దేశవాసు లుండనీ, లేక స్వామి ఉదరస్థం కానీ—అతనికు వచ్చేదీ పోయేదీ ఏమీలేదు.

తదుపరి ఒకదినం అమావాస్య అర్ధరాత్రీ—స్వామి అతనికి దర్శనం యిచ్చాడు.

'చటర్జిగారూ! మీరు చాలా వదిలేస్తున్నారే. స్వామివారి ఆకారం ఎట్లా వుంటుందో చెప్పండి?' వినోదు డడిగాడు.

చటర్జి—'చెప్పను, భయపడతారు. ముఖ్యంగా యీ ఊదో...'

ఉదయ—'ఎప్పటికీలేదు. హజారీ బాగ్ లో వుండేప్పుడు ఒంటరిగా నేననేక రాత్రిళ్ళు వేచాను. మా ఆవిడ అనేది...'

చటర్జి—'ఆవిడనేదే లేవోయి! పెద్ద సాహసంచేశావు. విక్టోరియా క్రాస్ వస్తుంది!—స్వామి మొదట సౌమ్య బ్రాహ్మణవేషంతో దర్శనం యిచ్చి అన్నాడు—'వత్స, నీప్రార్థనకు కరము సంతసించితి. ఏవరము కావలెనో కోరుకొమ్ము.'

బకూ అడిగాడు—'స్వామీ ముందు రామజాదును వధించు, వాడు నాకు పరమ శత్రువు.'

స్వామి అడిగాడు—'దేశహితము?

బకూ—'హితంగితం, యిప్పుడావల పెట్టండిస్వామీ! ముందు శత్రువధ కావాలి,'

స్వామి— ఆలాగుననే. క్రీడు మీద సంతకము చేసితివి గదా. యిక నిన్ను మా జాతిలో చేర్చుకొందును.—

అని చెప్పి ప్రభువైన రాయ్ మహాశయుడు,

భయం గొల్పే నిజరూపం ధరించాడు.

పర్వత ప్రమాణ దేహమూ
యజ్ఞవేది తను మధ్యమూ.
భయంకరంగా దివిటీల వలే వున్న
అక్షిద్వయమూ.
పసుపురంగు దేహంమీద నల్లని
చారలు.
బంగరపు రంగుమీద నీలాంజ
నపు పూతలు
గట్టి గట్టిగా నిట్ట నిలువుగా
వున్న రెండు మీసాలు
ఆకాశంలో పాతినట్లున్నయి
రెండు వాసాలు
ముఖం గిరిగుహవలే, తాలు
రక్త వర్ణము
దానిలో శంఖాల వలె వున్న
దంత సమూహము
రెండు సెలవుల వెంటా తెల్లని
నురుగూ
యిరవైమూళ్ల తోకా అటు
యిటూ పరుగూ
పళ్లు, కొరికే, కళ్లు వురిమీ
హుంకరిస్తారు ప్రభువులు
ఎక్కడి వక్కడే దడబిడా పరు
గెత్తుతాయి భీరు జంతువులు
దేవతల భయముచే యింద్రుని
దగ్గరకు పోతారు,
'దేవరాజా! వజ్రము ప్రయో
గించమ'ని మొరపెడతారు.
ఇంద్రు డంటాడూ 'అరె బాబూ
మీకీ దుర్బుద్ధి ఎవరు పుట్టించారు?

నేను బ్రతికి వుంటే శాశ్వతంగా నిలుస్తుంది నా తండ్రి పేరు!

కళ్ళకు గంతలు కట్టుకోండి, చెవులకు దూది మూసుకోండి,

రెండు గుక్కలు సుధ త్రాగి తలుపు తాళ్ళకున వేసుకోండి.!

స్వామీ దక్షిణ రాయ్ చట్టున తన తోక ఎత్తి, బకూబాబు వొంటి మీద నిమిరాడు. చూస్తోవుండగానే బకూ వ్యాఘ్రరూపం ధరించాడు. స్వామి అన్నాడు- 'పొమ్మొ వత్సా! యిక మేయుచూ బ్రదుకుము.'

చటర్జీ హుక్కాలో నిమగ్ను డయాడు. వినోద బాబు అడిగాడు. -'తర్వాత?'

-'తర్వాత యింకేముంది? బకూ లాలు ఒహాటే ఏడ్వటం. ఓస్వామీ! ఎంతపని చేశారుమీరు? నేను అన్నం ఎట్లా తినేది? ఎక్కడ పండుకొనేది? సిల్కు చొక్కాలు ఎట్లా తొడుక్కునేది? గృహిణి యిహ గుర్తుపట్ట దండోయి!'

స్వామి అంతర్థానం అయాడు. రామజంబుక శర్మ అన్నాడు- -'యిప్పుడు నీమ్మల్లె ఏమి పోయింది? గోలచేయకు బోకు.

పారిపోయి శత్రువులను పట్టుకు తిను?- బకూ కదలలేదు. భోరున ఒహాటే ఏడుపు. రామజంబుక శర్మ 'క్యాక్' అని కాలుపట్టుకు పీకాడు. బకూ కుంటుకుంటూ గెంతుకుంటూ పారిపోయాడు.

మరుదినం కొంతమంది కాపులు ముసలి పులొకటి గడ్డి వామిలో జొరబడటం చూశారు. చందాలు వసూలు చేసుకొని డిప్టీకలెక్టరు యింటికి వెళ్లారు.

ఆయన అన్నాడు- 'యిటువంటి పులిని ఎక్కడా చూడలేదే, అంతా గాడిదరంగు!...పాపం, నక్క పట్టుకు పీకింది. కాస్తైహోమియోపథి ఔషధం వేయించండి. కొంచెం నయమయాక అలీపూర్ తీసుకుపొండి- బక్షీస్ దొరుకుతుంది...'

బకూబాబు యిప్పుడు అలీపూరులో వున్నాడు. నేనక్కడికి పోయి చూట్టం లేదు- పెద్దమనిషిని వృథాగా సిగ్గుపరచటం ఎందుకని!

-'సరే చటర్జీ గారూ! స్వామీ దక్షిణ రాయ్ ఎప్పుడన్నా గుండు దెబ్బ తిన్నాడా?'- వినోదుడు ప్రశ్నించాడు.

-'గుండు అతన్ని స్పృశించదు.'

-'వారికి తగలక పోవచ్చు. వారి భక్తుల్లో కూడ ఎవరు తినలా?'

-'చూడు వినోద్! దేవతల్ని పట్టుకొని ఎగతాళి చేయబోకు- పాపం చుట్టుకొంది.-సరే మీరు కూర్చుంటే కూర్చోండి- నే లేస్తున్నా.'

★

బెంగాలులో సుందర వనం అనే అరణ్యముంది. అక్కడ పులులు విస్తారంగా వుంటాయి. ప్రపంచంలో, ప్రఖ్యాతి చెందిన బెంగాల్ టైగర్లు ఇచ్చటివే. మన దేశంలో ఆబోతులనూ, నాగుబాములనూ- బసవన్నా, నాగుమయ్యా అనే పేళ్ళతో- దేవతలుగా కొలిచినట్లే; అచ్చటి ప్రజలుకూడా వ్యాఘ్ర దేవత దక్షిణరాయిని కొలుస్తూ వుంటారు.

ఈకథ వ్రాసినప్పుడు బెంగాలులో స్వరాజ్య పార్టీ మంచి పలుకు బడిలో వున్నది మితవాదులు కౌన్సిల్లోకి పోవటానికి నానా వేషాలూ వేస్తూ వుండేవారు. ఇందులోని బకూబాబు కూడా ఆ తరగతికి చెందినవాడే. సనాతన వేషంతో కౌన్సిల్లోకి పోవాలని ప్రయత్నించాడు. బంగాలులో బ్రహ్మ సమాజం వుండటం వల్ల కానీండి, నాగరికత అభివృద్ధి చెందటం వల్ల కానీండి పిలకలు మాయమయాయి. అందువల్లనే బకూబాబు- అడ్వాన్సుడ్ ఆంధ్రులు, అవుసరానికి జందెపుపోగుకోసం వెదుకు కున్నట్లు- పిలక కోసం విగ్గుల మ్మేటిరిటి జారుకు వెళ్లాడు.

పులివెంట నక్క వుంటుందని వాడుక. ఆ వుద్దేశముతోనే రామజంబుకశర్మపాత్ర సృష్టింప బడినది. శర్మకూడా దక్షిణరాయికి ఏజంటుగా పనిచేస్తూ వుంటాడు. నక్క అరవును బంగాలిలో 'హువా, హువా!' అంటారు, హిందిలో 'హువా' అంటే 'అయింది' అని అర్థము. శర్మను అప్పుడప్పుడు హిందీలో మాటాడింపించింది యీఅరవు అర్థము కలిసి రావటానికే. ఇంములో జనసమాన్యముచే దేవతగా భావించబడే పులిని తిసుకొని సామాజిక మూఢనమ్మకాలమీద కూడా ఒక సమ్మెట పెట్టుపెట్టాడు. ఆంధ్రులకు అలిపూరంటే అలీపూరు జైలు జ్ఞాపకం వస్తుంది. కాని కలకత్తా వాసులు మాత్రం ఆలిపూరంటే జూగార్డెన్ జంతు ప్రదర్శన శాలాగా ఎంచుతారు.

—అనువాదకుడు.